# బెల్లం !

వి.డి.ఓ కనకారావు ఇంటి ముందు జాతరలా జనం గుమిగూడి పోయారు.

"మా లోన్సు మాటేటి ! మా ఫారాలు సబ్సీటు ఆఫీసు కెల్లాయా ? బేంకీవోలేటన్నారు ?" ఇలా ప్రశ్నల మీద ప్రశ్నలు, మనిషి మీద మనిషి తోసుకుంటూ కనకారావు ముందుకొచ్చి అడుగుతున్నారు.

చెప్పిందే మళ్ళీ మళ్ళీ చెప్పవలసి వచ్చినందుకు విసుగేస్తోంది. ఒక్కుమ్మడిగా జనం ఇంటికొచ్చి పడటంతో చిరాకేస్తోంది. ఆ చిరాకుతో కాస్తా కోపంవూ వచ్చింది కనకారావుకు. కోపంతో ప్యాంటు జేబుల్లో రెండు చేతులూ దూర్చి, తల కిందకు దించి రెండు, మూడు సార్లు దీర్ఘంగా తలూపాడు. ఎప్పుడన్నా కనకారావుకి కోపమొస్తే యిలా చేస్తాడు. జేబుల్లో చేతులకు నోట్లు తగులుతాయి. తలలో అనేక ప్లాట్లు మెదులుతాయి. తర్వాతని ఆ కోపకారణ సన్నివేశాన్ని అనుకూలంగా మార్చుకుంటాడు. ఇప్పుడు కూడా తలలో ట్యూబ్ వెలిగింది.

"చూడండొరే ! అందరొక్కక్షణం నిశ్శబ్దంగుంటే అందరికీ కలిపి భోగట్టా చెప్పేస్తాను...." అని కేకేసాడు.

జనం అంతా నిశ్శబ్దమై పోయారు.

"రజకులకి ఇస్త్రీ పెట్టెలూ, బల్లలూ కావాలనీ, క్షురకులకి

కత్తెర్లూ, పాదులూ కావాలనీ, హరిజన్లకి పందులు కావాలనీ- యిలాగ మీ అందరికీ లోన్సు ఫారాలు రాసాను, ఆటి మీద మీ సంతకాలు తీసుకున్నాను గదా ?" అని కనకారావు ప్రశ్నించాడు.

"అదిగా ఫారాల్తోటి తమకి పాతికేసి రూపాయిలిచ్చుకున్నాము గాదా ?" జనంలోంచి ఎవరో బదులు పలికారు.

ఈ పలుకు కనకారావు కర్ణభేరిని చేరనేలేదు. ఇలాంటి మాటలు దూరనివ్వని సౌండ్‌ప్రూఫ్ చెవులు కనకారావువి !

"ఆ ఫారాల్ని సమితాఫీసులో కుర్చీలన్నీ తిప్పి, సంతకాలు చేయించి డి.ఆర్.డి.ఎ. ఆఫీసుకి పంపాను. సబ్సిడీ యివ్వాల్సిన ఆఫీసు అదే. అక్కడికి మీ ఫారాలు పంపడం కెన్ని పాట్లు పడ్డానో మీకేటి తెల్సు ?" అని కొనసాగించాడు కనకారావు.

"సబ్సిడీ ఆఫీసులోగూడా కద్దులుంటాయట్రో అనంతే, అప్పులుజేసి తెచ్చి మీ కిచ్చాము కదా ?" అన్నారెవరో జనంలోంచి మళ్ళీ.

"ఏవయితే యేటిపాటు యెప్పుడుగా క్షవరం, గెడ్డాం చేత్తానని వొప్పుకొని. ఎల్లుండాదుటు కాక యేభయి రూపాయిలోడుకొని తెచ్చి ఇచ్చాను" అన్నాడు ఈరడు జనంలోంచి.

సౌండ్‌ప్రూఫ్ చెవులకివి సోకనేలేదు. కనకారావు మళ్లీ చెప్ప సాగాడు.

"అదిగో, ఆ సబ్సిడీ ఆఫీసుల మీ ఫారాలు తొంగొన్నాయిన్నాళ్లు. మీరు వచ్చి చూసుకు తినేస్తారు. నా చేతిలేటున్నాది ? అయితే, మీ అదృష్టం బాగుంది. ఎల్లుండి ముఖ్యమంత్రిగా రొస్తున్నారు- కాలేజీ హాస్టలూ, మత్స్యకారుల కాలనీ ఓపెనింగుకి ! ఎల్లుండి మధ్యాన్నం హెలికాప్టర్‌ల దిగుతాడు."

"ఎలికాప్టరంటే, అల్లప్పుడు వొంశధార వొరదలప్పుడు ఆకాశం మీంచి అన్నం పొట్లాలొదిలేయి....అవే గదా బావ్ ?" అడిగాడు ఈరడు.

"ఆఁ! అదే! దాని మీదిక్కడకొస్తారు. వచ్చినపుడు—నా ఐదుగు తమ్ముళ్లకు నా పేద ఆడపడుచులకు యీ చేతులమీదుగా సహకారం అందివ్వాలి, యేర్పాట్లు చేయండి— అన్నారట! అంచేత యిన్నాళ్లా సబ్సిడీ ఆఫీసులో తొంగొన్న మీ ఫారాల్ని లేపీ, ఆటికి సబ్సిడీ రాసీ, సంతకాలు పెట్టీ చెక్కులు పంపారిపుడు...." అని ఆగాడు కనకారావు.

"సబ్సీటు వొచ్చీసిందన్న మాటయితే! హమ్మ! అయితిపుడిచ్చీరా బావ్?" అని ఆశగా అడిగాడు చాకలి గుంపడు.

"ఛత్, చెప్పిందాకా ఆగండ్రా ఎదవల్లారా" అని గసురుకొన్నాక,

"ఇప్పుడు సబ్సిడీ ఆఫీసు నుండి కాయితాలు, చెక్కులు బ్యాంకుకి వచ్చేసాయి. బ్యాంకువారు అప్పులిస్తే ముఖ్యమంత్రిగారు పంచుతారు. ఇక మీ అదృష్టం బ్యాంకువారి దయాధర్మం! ఇవీ సంగతులు. చిత్తగించవలెను. ఇట్లు మీ విధేయుడు కనకారావు, గ్రామాభ్యుదయాధికారి." అని తగురీతిలో హాస్యం జోడించి ముగించాడు.

ఈ హాస్యాన్ని అర్థంచేసుకొనే జ్ఞానమూ, అనుభవించే సమయమూ లేని జనం—

"అయితే, బేంకోలు యేటన్నారు బావ్?" అని అడిగారు.

"యేటంటారో అడగవలసింది మీరు. ఎల్లి అడగండి."అన్నాడు కనకారావ్.

"అలాగనీస్తే ఎలాగ బావ్? ఇంతజేసారు. అ బేంకీ పనిగూడా మీరేజేసిత్తే మీ పేరు సెప్పుకుంతాను. దయగల పెబువులు, తఁవరు..." బ్రతిమాల సాగాడు ఈరడు.

"ఓరే ఈరిగా! నువ్వు డప్పు కొడతన్నావుగానీ నీను పొంగిపోను. నీను చెయ్యివలసింది చేసాను. ఇంక బ్యాంకు వారే చెయ్యాల. ఈ పొగిడిందేదో అల్లనే పొగుడు, ఆ డప్పు బ్యాంకులోనే కొట్టు.... ఎల్లు....ఎల్లండెల్లండి...." అనేసి జనంలోంచి దారి చేసుకు ఇంట్లోకి వెళ్లబోయాడు.

వె ళ్తున్న కనకారావుకి చాకలి గుంపడు ఎదురొచ్చి, బతిమాల్తా-

''బాబ్బాబూ ! అలాగనీకుమీ.... బేంకీవోల్లోటి మానాటోలిమి మాటాడనేము...'' అన్నాడు.

''బాబ్బాబూ ! ఆకర్న ఈనగాసి సక్కలు పాజ్జేసీను. ఇప్పుడికే వాక్కోలికీ వొండా, వొందన్నరేసి కర్సులయిపోనాయి. కనికరించు బాబూ'' అని ఈరడు మళ్ళీ బతిమాలాడు.

''అందుకేన్రా ! ఆ డబ్బు వ్యవహారం వల్లనే నేను బ్యాంకుకి వెళ్లనంటున్నాను. మీ దగ్గిర తీసుకున్న డబ్బు నేనొక్కద్నే తినీలేదు. మీ ఫారాల మీద సంతకాలెట్టిన విలేజిసిస్టెంటు కాంచి, బీడీవో దాక, మరి సబ్సిడీ ఆఫీసుల ప్యూను నుండి పీ. ఓ. దాక యెన్ని చేతులికి పంచానో ప్రసాదం పంచినట్టు ! ఎవరికి పంచకపోతే ఆలకే కోపం. ఆలు కోప్పడితే మీ పనవదు. పనవకపోతే మీరు నన్ను తినేస్తారు. ఇన్ని తంటాలన్న మాట !

కానీ, బేంకోలికివన్నీ అక్కర్లేదు. మీ పేర్లెట్టుకొని నేనెల్లి చెప్తే మీ కాడ నేనేదో దోచేసి, దాచుకున్నట్లుగా చూస్తారు. ఎనభయ్యారు కొర్రీ లెడతారు. ఎరగనోడికి చెప్పినట్లు ఎవవరూల్సన్నీ చెప్తారు. అందుకే నేనెల్లను. మీరెల్లండి. బతిమాలండి. ఏం ? అంతగా కాదంటే శివున్నా యుడికి చెప్దాం ! అతగానీ మధ్య మండలాధ్యక్ష పదవిమీదికి గురిజూస్తే న్నాడు. దానికోసం మీకు సాయం జేస్తాడు. య్యేటి ? అంచేత, మరేం భయం లేదు. వెళ్లండెళ్లండి.'' అని అన్ని విధాలా నచ్చచెప్పాడు.

అంతా వెనుదిరిగారు. కనకారావు ఇంట్లోకి వెళ్ళిపోయాడు.

* * *

మర్నాడు ఉదయం పది గంటలకు మర్రిపాడులోని కురకులా, రజకులా వగైరా కులవృత్తుల వారందరూ బ్యాంకుకి వెళ్లారు.

కొత్తగా కట్టిన డాబా ! విశాలంగా వుంది బ్యాంకు ! బ్యాంకు

వరండాలో అనేక పథకాల పోస్టర్లు ఆశలు ఊరిస్తున్నాయి కష్టమర్ల లో ! నోట్లకట్టలూ, నవ్వులు చిందే మొహాలే గోడల్నిండా గల పోస్టర్లలో కన్పిస్తున్నాయి !

వరండాలోకొచ్చిన జనాలూ యెటు వెళ్లాలో, యెవర్ని అడగాలో తెలీక తికమక పడసాగారు. ఈరడు అక్కడున్న తెల్ల యూనిఫాం వ్యక్తిని అడిగాడు. అతను 'ఋణాలు' అనే బోర్డుగల రూము వైపు చూపించాడు.

అందరూ ఋణాలు రూముకి వెళ్లారు.

ఆ రూము చల్లగా వుంది. కరెంటు వెల్తురుతో తెల్లగావుంది. ఆ చల్లటి రూములో పెద్ద టేబిల్, దానెదురుగా గాద్రెజ్ కుర్చీ వున్నాయి. సరిగ్గా వాటికి మీదుగా బిల్డింగ్ రూఫ్‌కి సీలింగు ఫ్యాను తాకట్టు పెట్టబడ్డ వస్తువులా బిగించబడి వుంది. ఫ్యాను రెక్కలు అసలూ ఫాయిదాలా తీర్చలేక పాలేర్లయి పన్జేస్తున్న వారిలా అవిశ్రాంతిగా తిరుగుతున్నాయి. ఆ గాలికి టేబిల్ మీంచీ యెగిరి పోకుండా, ప్రోనోట్లు పీక చుట్టగా కుదేలయి కూలబడిన పేదల్లా పేపర్ వెయిట్ కింద కాగితాలు అణిగి వున్నాయి.

"దండాలు బావ్..." అందరొక్కసారన్నారు.

ఎదురు కుర్చీలో బాబు దండాలందుకొని, కళ్లతో ప్రశ్నించాడు.

ఈరడు సంగతి చెప్పాడు. కుర్చీబాబు కళ్ళు టేబిల్ మీది కాయితాల పైకి మార్చి, ఓ క్షణం తర్వాత—

"యే ఊరు ?" అనడిగాడు.

'మాది మర్రిపాడు బావ్" ఈరడు.

"మర్రిపాడా ? నా విలేజి కాదే..." కుర్చీబాబు,

జనాలకేమీ అర్థం కాలేదు. కాస్తా చొరవ, ధైర్యమూ వున్న ఈరడే "ఔను బావ్. మర్రిపాడు మా విలేజి..." అన్నాడు మళ్లీ.

''ఔను. నా విలేజి కాదు'' అన్నారు కుర్చీబాబు.

''ఔను బాప్. మీది గాదు... మాది ఆ విలేజి...'' చెప్పాడు ఈరడు.

''అందుకే వెళ్లండి''

''ఎక్కడికి బాప్ ?''

''మీ ఊరు....''

''బాబ్బాబు ! మా ఊర్నుంచీ వొచ్చాం. సబ్సీటొచ్చింది. లోన్సు కావాల ! కనకారావు బాబు పంపారు. దయగల పెబువులు... తమరు కనికరించాల.'' ఈరడు దప్పు ప్రారంభించాడు.

''చూడయ్యా ! మర్రిపాడు మనిషీ ! మీ ఊరి ఫీల్డాఫీసర్ని నేను గాదు. అదిగో ఆ ఎదురు రూము. అక్కడకెళ్లి అడగండి. వెళ్ళండెళ్ళండి'' తగిలేసారు కుర్చీబాబు.

ఎదురు రూముకి వెళ్లారు జనాలు... అక్కడ అమ్మగారున్నారు.

''దండాలమ్మగోరూ....'' అన్నారంతా.

ఏం ? అన్నట్లుగా చూసారమ్మగారు దండాలందు కోకుండా !

''మాది మర్రిపాడు విలేజమ్మగారూ'' అన్నాడు ఈరడు.

''అయితే, ఎవరు కాదన్నారు ?'' కసిరారమ్మగారు.

ఈ కసురుకి ఈరడు కొద్దిగా జంకి, నసుగుతూ—

''అది కాదండమ్మగోరూ ! మా ఊరోళ్ళందరం కలిసి లోన్సు ఫారాలెట్టాం. ఏడాదయిపోనాది. సబ్సీటు వొత్తాదని తిప్పిదిప్పారు. ఆకరికి నిన్న సెప్పాడు కనకారావు బాప్. ఎల్లుండి ముఖ్యమంత్రిగారొత్తంద్రట ! సబ్సీటులోన్లు పంచుతారట. అందికనొచ్చామమ్మా'' అన్నాడు చివరికి.

''బాగుంది, బాగుంది. మంత్రులూ, ముఖ్యమంత్రులూ వొచ్చినపుడల్లా పంచీడంకిది బూడిద కాదు...డబ్బు ! ఎవరికిబడితే వారికేలోన్సు ఇచ్చేస్తే, ఎప్పుడుబడితే అప్పుడు మేళాలు బెడితే ఇక మరి చెప్పనక్కర్లేదు

బ్యాంకుల సంగతి ! దివాళాబోర్డులు పెట్టుకోవాలి. ఇలా అప్పులిస్తే మరి బ్యాంకుల దివాళా తియ్యకేమవుతాయి ?'' అంటూ ప్రశ్నించారమ్మగారు.

అప్పులిస్తే ఎందుకు దివాళా తీస్తాయో అర్థం కాలేదు ఈరడికి.

అప్పులిచ్చిన సావుకార్లెందరో బాగుపడతన్రు ! మా ఊరి అమ్మన్న శెట్టి అప్పులిచ్చి రైతువోరి భూమి సగంకి సగం క్రెయింజేసుకున్నాడు. ఊరోల్ల బంగారం, గింగారం వొడ్డీల్లోటి కదల్లేక అతగాడి బీరువాల్ల వుండిపోనాది. అప్పులోడుకునోళ్ళు దివాళా తీస్నారుగానీ అమ్మన్న శెట్టి తియ్యలేదు. మరి అప్పులిస్తే బ్యాంకు లెందుకు దివాళా తీస్తాయి ?—

అని అడగాలనుకున్నాడు.

ఏ నాసుగు వాల్లో, ఏ కుంభకోణమో జరిగి తీస్తాయి దివాళా— అని అనాలనుకున్నాడు. కానీ,—

జవాబిస్తే మరింత జంయ్యి మనెగిరిపోద్ది, అసలే కోపగొట్టులాగున్నా రమ్మగారని భయపడి డప్పుకొట్టడం ప్రారంభించాడు. డప్పుకి ఎంతటి గొప్పవారైనా పడతారనే గట్టినమ్మకం ఈరడికి !

“అమ్మమ్మమ్మా ! మీరలగనికండి. పేదముండాకొడుకులం ! మీ దయవల్ల బాగుపడాల్సినోలిమి. మీ చెయ్యి లక్ష్మితల్లి చేయి. మీ చేతి చలవ మా గొప్పది. మీ చల్లని చూపే చెప్పేస్తాంది....'' యిలా డప్పు గొడ్తున్నాడు.

డప్పు నిష్ప్రయోజనమైంది. అమ్మగారిలాంటి పొగడ్తలకు పడిపోయే దశయేనాడో దాటి పోయారు. ప్రతివ్యక్తి పొగడ్త వెనుకా, మాటల వెనుకా ఆ వ్యక్తి స్వార్థం వుంటుందనీ, అది వీలయితే ఎదుటి వ్యక్తిని నష్టపరుస్తుందనీ— ఓ నిశ్చితాభిప్రాయాని కొచ్చారమ్మగారు. అంచేత, ఈరడి డప్పు శబ్దానికి తీక్షణంగా చూసారు ఈరడ్ని !

చిరిగిన గావంచా భుజమ్మీద గలిగినవాడు. చింపిరిజుత్తువాడు.

కంపెనీ బాడీ ధరించినవాడు. గావంచా చిలకట్టు వాడు. వాడు పసర్ల వీరప్పడు అనే ఈరడు !

అమ్మగారు తీక్షణంగా చూట్టంతో, యెందుకైనా మంచిదని రెండు చేతులెత్తి దండం పెట్టాడు. అమ్మగారికి నవ్వొచ్చింది. కానీ, ఆపుకొని విసుగ్గా—

"నీ పేరేంటి ?" అనడిగారు.

"పసర్ల ఈరప్పడమ్మా" వినయంగా చెప్పాడు.

"వీళ్ళంతా మర్రిపాడు విలేజర్లేనా ?"

"ఔనమ్మగోరూ...ఔను..." అందరన్నారు.

"చూడండయ్యా ! సబ్సిడీ వచ్చినంత మాత్రాన, మంత్రులొచ్చినంతమాత్రాన అప్పులివ్వమని రూల్సులేవు. మేము మీ ఊరు రావాల. మీరు యే వృత్తికోసం అప్పు అడుగుతున్నారో చూడాల. ఈ అప్పుద్వారా మీరా వృత్తి జేసి మా అప్పు తీర్చి, మీరు అభివృద్ధి అవుతారా లేదా ? అని లెక్కలెయ్యాల. మా లెక్కల్లో మీరు పెట్టిన స్కీములు పనికొస్తాయని తేలితే అప్పుడు మేము అప్పులివ్వాల, తెల్సిందా ?" అని అడిగారు.

"మాకు యీ రూల్సన్నీ ఏటి తెలుస్తాయి ? తమరు దయతలసాల గానీ, మీ కష్టముంచుకోము. మాకు వీలయ్యిందిచ్చుకుంతాము. అన్ని ఆఫీసులికీ పంచినాము ప్రసాదం పంచినట్లుగా ! తమకిగూడా....!!" అంటూ ఆ ఆశగూడా చూపాడు వ్యవహర్తలా ఈరడు.

"అంటే, అంటే ? ఏమిటీన్ని వుద్దేశం ? ప్రసాదమంటే లంచమేనా ? నాకు లంచం ఆశ చూపుతావా ? పో ! పో ! ఇక్కడ్నుంచి, నీకేగాదు, మీకెవరికీ యికలోన్సు యివ్వనే యివ్వను, పొండి" అని కసిరేసారు అమ్మగారు.

ఈరడికి మతిపోయింది. డప్పుకీ పడలేదు. ప్రసాదానికీ లొంగలేదు. చిత్రంగా కన్పించారమ్మగారు. ఇక యేమి మాట్లాడినా మంచిది కాదనే భావంతో అందరికీ "పదండి, పదండి" అన్నట్లు చేత్తోనే సైగచేస్తూ వార్ని ఋణాల రూములోంచి బయటికి నడిపించాడు.

జనం అంతా నిరాశపడిపోయారు. అటు అప్పులుచేసి ఇచ్చుకున్న లంచమాగోడకు వేసిన సున్నంలా మరి తిరిగిరాదు. ఇటు లోన్సు అయ్యే అవకాశం లేదు—అనుకున్నారు. చివరికి ఆశగా శివున్నాయుడిని చేరుకున్నారు.

శివున్నాయుడికి యే పదవీలేదు. కానీ ఆర్థిక బలమూ, అంగబలమూ వల్ల మంచి పవర్ వుంది. ఆ మండలంలో శివున్నాయుడు కులానికి మెజార్టీ వుంది. ఆ కులంలో మంచి బంధుత్వముంది. లాభాల మీద లాభాలు తెచ్చే సారా వ్యాపారముంది. వంశధార కాలువ కింద వందెకరాల పల్లముంది. జిల్లాలోని ఒక మంత్రిగారి మద్దతుంది. అంచేత మండల అధ్యక్ష పదవి మీద కన్నుంది శివున్నాయుడికి.

జనం చెప్పినదంతా జాగ్రత్తగా చెవులొగ్గి విన్నారు నాయుడుగారు. విన్నట్లు తలవాల్చి నటించారు. తర్వాత —

"అదా సంగతి! యేం ఫర్లేదు. నేను చూస్తాను. మీ లాంటోళ్ళ కోసమే గవర్నమెంటు అనేక పథకాలు పెట్టింది. అనేక రకాల ఋణాలిప్పిస్తోంది. కానీ, ఇలాగే మధ్యలో ఆటంకాలు! ఈ ఆటంకాల వల్లే ప్రభుత్వం చేసే మంచిపన్లు ప్రజలకు అందకుంటున్నాయి. ఇవే మాలాంటి నాయకులం చూడాలా! చూసి, మీలాంటోళ్ళకి సాయపడాల. అప్పుడే పార్టీకీ, ప్రభుత్వానికీ మంచిపేరు. యేఁవంటారు?" ఇలా చిన్న సైజు ఉపన్యాసం ఇచ్చారు నాయుడుగారు.

యేది చేసినా చేయకపోయినా చక్కగా ఉపన్యసించగలగాలి ఈనాటి రాజకీయవేత్త. అంచేత నాయుడుగారు ట్రైనింగ్ అవుతున్నారు. చదివింది లా కోర్సు కావటంతో నాయుడుగారు మంచివక్త అనే పేరు తెచ్చుకుంటున్నారు గూడా!

నాయుడుగారి ప్రశ్నకు జనం—అంతేగద మరి—అన్నాక,

"అంచేత, రేపు నేను బ్యాంకుకి వెల్తాను. నాకీ మధ్య కేంప

లెక్కువై పోయాయి. ఊర్లో వుంటే ఈపాటికే మీపని తేలిపోయున్ను ! అయినా చూస్తాను. మీకేం ఫర్లేదు. రేపొచ్చి కలవండి" అన్నారు.

"చిత్తం, అలగే బాబ్...." అన్నారంతా.

"అయితే ఇక నాకు శెలవా ?" అన్నారు నాయకుడిలా నాయుడు గారు. జనం తికమకపడి, చివరికి అర్థమయ్యాక తేరుకొని, చేతులెత్తి మొక్కి; శెలవుతీసుకున్నారు.

o o o

మర్నాడు శివన్నాయుడుగారు బ్యాంకుకి వెళ్లారు. బ్యాంకులో ప్రజలు నాయుడుగారికి నమస్కారాలు పెట్టారు. నాయుడుగారు తలూపుతూ లోనకెళ్లారు. లోనకొంతమంది అధికార్లకి నమస్తేలందించారు. కొంత మందిని యేంబాబూ అన్నారు. కొంతమందికి చిరునవ్వులు పంచారు. అమ్మగారి దాపుకొచ్చి—

"నమస్కారం మేడంగారు" అన్నారు చేయెత్తకుండా నోటితో.

అమ్మగారు చూసి—నమస్తే, రండి కూర్చోండి- అన్నారు. నాయుడు గారు ఎదురు గ్రారెక్ కుర్చీలో కూర్చున్నారు. వారితోనే వచ్చిన వి. డి. ఓ కనకారావు కూడా ప్రక్కనే స్టూలుమీద కూర్చున్నాడు.

"మాకు రేపు ముఖ్యమంత్రిగారి చేతిమీదుగా ఇప్పిస్తారు గదా !" అనడిగారు నాయుడుగారు.

"యేంటివి ?" ప్రశ్నార్థక మొహంతో అడిగారమ్మగారు.

"ఇదేంటోయ్ కనకారావ్ ? యేంటంటారేటి అమ్మగారు ?" ఆశ్చర్యపోయారు నాయుడుగారు.

"బోర్ వెల్ - మోటార్ కి ప్రొసీడింగ్సు వొచ్చాయిగదండీ. రేపు మోటార్ ఇస్తున్నాం కదా...అదేనండీ, సుభద్రమ్మగారి...." ఇలా వంగిరి వంగిరిగా అమ్మగారికి విషయం చెప్పాడు వి. డి. ఓ.

"సుభద్రమ్మ విషయమా ? సర్సరే. మీకు అంటేమళ్లీ యేఁవిటా... అని ఆశ్చర్యపోయాను." అని నవ్వేసారమ్మగారు.

"చంపేసారు" అని గొల్లున నవ్వేస్తూ, కనకారావు జెబ్బమీద చరుపు చరిసారు నాయుడుగారు.

"నిజంగా, మీరు నన్ను చంపేసారు." జెబ్బ తడుముకుంటూ అన్నాడు వీ. డీ. ఓ.

"మీరిద్దరూ కలిసి మమ్మల్ని చంపుతున్నారు. భర్తపేర ఒకలోనూ, భార్య పేర మరో లోనూ పెడతారు. పెద్ద రైతులై వుండీ సబ్సిడీలు సంపాదిస్తారు. ఈ విషయాలు రూల్సుకి విరుద్ధం. యేఁవంటే మీకోఁవం" కాస్త మొహం మాడ్చుతూ అన్నారమ్మగారు.

"నా భూమి రికార్డుల ప్రకారం నాకు అప్పుఇచ్చారు. నా భార్య సుభద్రమ్మ రికార్డుల ప్రకారం ఆవిడకి అప్పిచ్చారు. ఇందులో తప్పేటి ? రికార్డుల్లో భూమి ప్రకారం చిన్న రైతులమే గనక సబ్సిడీలొచ్చాయి. ఇందులో రూల్సుకి ఎగినిస్టేటున్నాది చెప్పండీ ? అదీగాక ఒకమాట చెప్పేదా మేడంగారూ ? కొన్ని చట్టాలు వుంటాయి. వాటికి సవరణలా వుంటాయి. మరలాగే రూల్సు అన్నాక వాటికి లూప్ హోల్సా వుంటాయి. వాట్ని మాలాంటోల్లు వుపయోగించుకునే సాయం మీలాటి ఆఫీసర్లు చేయాల ! మేము మీ లాటోళ్ళకి బదిలీల్లోనా, ప్రమోషన్లలోనా సాయం జేస్తాం ! ఇది గివ్ అండ్ టేక్ పోలసన్నమాట. అంతేగద కనకారావ్ ?" అని పై పోలసీకి కనకారావు యొక్క అంగీకారాన్ని గూడా అడిగారు నాయుడుగారు.

"గొఁప్ప కరెక్టుగా జెప్పార"న్నాడు, రాని నవ్వుతో కనకారావు.

"అయితే మరి మాకు శలవా ?" అన్నారు నాయుడుగారు కుర్చీ

లోంచి కాయాన్ని లేస్తూ ! అంతలోనే యేదో గుర్తుకొచ్చినవారిలా మళ్ళీ కూర్చుంటూ—

"అన్నట్టు మర్చిపోయాను" అన్నారు.

యేఁవిటన్నట్టు ప్రశ్నార్థక మొహం పెట్టారమ్మగారు.

"ఆఁ ! యేం లేదు. ఈరోజుల్లా రాజకీయనాయకులు గొప్ప చులకనై పోయారు. ఎప్పుడు ప్రజలకి కనబడినా యేదో ఒకటడుగుతారు. ఎలక్షనప్పుడు సారా అడుగుతారు. సీరలడుగుతారు. సీల్డు నోట్లడుగుతారు. ఆ తరాత బియ్యఁవంటారు. భూఁవులంటారు. ఇల్లంటారు, పొల్లంటారు. కోమటోడ్ని జూస్తే నక్క సొంటి అడిగిందట ! అలా వుంది.

ముఖ్యమంత్రి గారొస్తున్నారు కదా, వారిచేతి మీదుగా లోన్సిప్పిం చవా ? అని మా ఊరి కుల వృత్తుల వాళ్ళంతా నాల్రోజుల్నించీ తినేస్తున్నారు. వాళ్ళకి సబ్సిడీ గూడ వచ్చీసిందట. యేఁవోయి కనకారావ్ ?" అని కనకారావుని చెప్పమన్నారు.

కనకారావు ఔనొచ్చీసిందని చెప్పాడు.

"అందుకనీ, వాళ్ళ లోన్సు జేసిస్తే మాటా దక్కుతుంది. వాళ్ళకి మేలూ జరుగుతుంది" అన్నారు నాయుడుగారు.

"చూడండి. ఇలా మంత్రులొచ్చినపుడు మేళా లెడతారు. అంత వరకూ డి. ఆర్. డి. ఎ. ఆఫీసులో యేడ్చే దరఖాస్తులు అప్పుడు కదుల్తాయి. ఇదే అదునని కొంతమంది బినామీ లోన్లెడతారు. కొంతమంది సబ్సిడీ కొట్టేడానికి సన్నకారులవుతారు. మిడిల్ మెన్ లేచి ఇటు బ్యాంకునీ, ప్రభుత్వాన్నీ అటు ప్రజలనీ మోసగించి సబ్సిడీని సర్దుకొని స్కీముల్ని పురిట్లోనే సంధి కొట్టిస్తారు. ఇదిగో, ఇలాంటి పద్ధతులు నాకు నచ్చవు. నేను డైరెక్టుగా లబ్దిదారుని పరిశీలించి, స్కీముగూర్చి ఆలోచించి లోను

శాంక్షను జేస్తాను. మీ ఊరివాళ్ళకదే జెప్పాను" అన్నారు విషయమంతా వివరించి, మరి మాట్లాడొద్దన్నట్లు.

"పేద ముండా కొడుకులు. కాస్తా కనికరిద్దురూ...." అన్నారు నాయ్డుగారు.

"పాపం యేడాది నుండీ దరఖాస్తులు పెట్టి యెదురు చూస్తున్నారు మేడమ్‌గారూ" జాలి చూపాడు వీ. డీ. ఓ.

"ఎందకండీ నన్ను విసిగిస్తారు ? మా ప్రొసీజర్స్ సంగతో ? లోన్ ఇచ్చేముందు యెన్ని పరిశీలించాలనుకుంటున్నారు ? అదీగాక, ఇలాంటి మేళాల్లో ఇచ్చే ఋణాలు రికవరీ కావటంలేదు. నో, నో, నాట్ పాసిబుల్" అని ఇంగ్లీషులో గూడా సాధ్యం కాదనేసారమ్మగారు.

అమ్మగారు విసుక్కోవటం, యింగ్లీషూ-తెలుగులో గూడా కాదు-అనేయటంతో నాయుడుగారికి ఆగ్రహం కలిగింది.

"ప్రొసీజర్సూ, రూల్సూ మాటకొస్తే అవి ప్రజలకి చెప్పడంకే గాదు; మనమూ పాటించాల !" అన్నాడు నాయుడుగారు.

"అంటే....అంటే, యేవిఁటంటారు మీరు ?" కోపంతో ముక్కుపుటాలెగరేస్తూ అడిగారమ్మగారు.

"ప్రొసీజర్సు పేరు జెప్పి....యే పేద జనంకి వీలుగాదంటున్నారో ఆ పేదలే మీకుగానీ, నాకుగానీ ఇదిగీ బట్టా, పొట్టా నింపుతన్నారు. వాళ్లే కష్టపడపోతే మీరు కాగితాలు రాసుక్కూర్చోలేరు. నేను కబుర్లు చెప్పుకు తిరగాలేను. ఆ విషయం గుర్తుంచుకోండి" అన్నారు నాయ్డుగారు.

"గొప్ప ప్రేమ పుట్టుకొచ్చింది తమరికి. తమరి సంగతి మాకేమి కొత్తగాదు'' అని కోపంతో ఇంకేదో అనాలనుకున్నారు అమ్మగారు.

కానీ, కనకారావు కల్పించుకొని ఇరువుర్నీ శాంతింప జేసాడు. ఇరువురికీ పరిష్కార మార్గంగా ఒక సులువు చెప్పాడు.

అదేమిటంటే—

దరఖాస్తుదారులందరికీ ఆయా పథకాలకు ఋణాలు ఇస్తున్నట్లుగా శాంక్షనింగు లెటర్సు మాత్రమే ఇస్తారు బ్యాంకువారు. వాటినే ముఖ్యమంత్రిగారిచేత జనాలకు పంపిణీ చేయిస్తారు !

"ఏమంటారు ? ఇలాగైతే మీకూ డామ్యేజ్‌మెంటేషను బెడదా, ప్రొసీజర్సు గొడవా వుండవు. నాయుడుగారికీ నామోషీ వుండదు. ఈ ప్రోగ్రాం అయ్యాక మీకిష్టమైతే లోన్లిస్తారు. లేదంటే లేదు. శాంక్షనింగు లెటర్లలో ఎలాగూ షరతులు రాస్తారు. ఆ షరతుల మీదే; ఇష్టంలేకపోతే తోసివెయ్యొచ్చు. ఏమంటారు ?" అని అమ్మగారిని అడిగాడు కనకారావు.

అమ్మగారు ఆలోచనలో పడిపోయారు.

"ఇదే మంచిది నాయుడుగారూ ! మీకు మాట దక్కుతాది. వారికి కష్టమూ వుండదు. మీరు మామూలుగా జనాలతోటి-ఇదిగో రేపు ముఖ్యమంత్రిగారి చేత శాంక్షన్ లెటర్లిప్పిస్తాం. ఈ బిజీ తగ్గాక బ్యాంకు వారు లోన్లిస్తారు. మీకేం ఫరవాలేదు-అని చెప్పండి. వాళ్ళు నమ్ముతారు. అంతే ! మీకు మాత్రం వాళ్ళు నమ్మటం కావాలగానీ, వాళ్ళకి లోన్సు యిపోవాలని వుందేంటి ? ఆలోచించండి...." అని నాయుడుగారికీ చెప్పాడు కనకారావు.

నాయుడుగారూ ఆలోచనలో పడ్డారు.

ఇరువురికీ ఈ పరిష్కారం అంగీకారమయ్యింది.

o o o

అదో పెద్ద మైదానం !

పిల్లలు కీ యిచ్చి విడిచి పెట్టిన ఆటబొమ్మల్లా కార్లూ, జీపులూ అటూ ఇటూ తిరుగుతున్నాయి. ఎప్పుడూలేని అలంకారాల్తో నగరం అందంగా సింగారించుకుందా రోజు. నగరం నుండి మైదానం దాకా జనం తండోపతండాలుగా చేరిపోయారు.

ఆ పెద్ద మైదానంలో ఒక భాగంలో వివిధ బ్యాంకులవారి స్టాల్సూ: మరోవైపు సభాస్థలి, మరో భాగంలో కిళ్లీ, బీడీ, సోడా, సిగరెట్ కొట్లూ వెలిసాయి. అప్పుడు సమయం సాయంత్రం అయిదు గంటలు !

ఆకాశంలో హెలికాప్టర్ కన్పించింది. ఎర్రటి వస్త్రధారి హస్తం మైదానంలోని జన సముద్రాన్ని పల్కరించింది. జన సంద్రంలో సంతోష కెరటాలెగసాయి. వాట్ని కంట్రోలు జేసాయి ఖాకీ లాఠీలు !

తెరమీదకి రంగుల బొమ్మలా మైదానం మీద దిగారు ముఖ్యమంత్రి గారు. అధికార, అనధికార ప్రముఖులు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రికీ, జనాలకూ మధ్య ఖాకీ కవచం ఏర్పడింది.

ముఖ్యమంత్రిగారు బ్యాంకువారి స్టాల్స్ దర్శించారు. సుభద్రమ్మకు మోటార్ ఇచ్చారు. రాజారావుకి ట్రాక్టరిచ్చారు. మరొకరికి రిక్షా, మరొకరికి మరోటి-ఇలా అనేకం అందజేస్తూ ఫోటోలు దిగారు. తర్వాత టాపు లేని జీపులో సభాస్థలికి చేరారు.

సభా వేదిక నలంకరించి, బడుగు తమ్ముళ్ళకూ, ఆడపడుచులకూ అనేక హామీలిచ్చారు. వాగ్దానాల్ని పంచిపెట్టారు. కండలు తిరిగిన తన శరీరాన్ని ఎముకలు దేలిన పేదలకంకితమన్నారు. అభిమానుల చప్పట్లు మార్మోగాయి !

అప్పుడు శాంక్షనింగ్ లెటర్స్ పంపిణీ ప్రారంభమయ్యింది. అమృతం పంచినంత సీరియస్‌గా ఒక్కొక్కరికీ లెటర్స్ పంచుతున్నారు ముఖ్యమంత్రిగారు. మర్రిపాడు వంతొచ్చింది. ఈరడు వెళ్ళాడు. ముఖ్యమంత్రిగారు కవరందించారు. ఈరడు అందుకునాడు.

"బాబో సిన్నమాట సెప్పుకునీదా ?" అన్నాడు వినయంగా.

"చెప్పు...." అన్నారు ముఖ్యమంత్రి నవ్వుతూ ప్రేమగా !

"బాబూ ! మా సిన్నప్పుడు మేం ఆకలికి ఏడిత్తే మా అమ్మ ఇంత బెల్లం ముక్క మండకి రాస్ని నాకోబెట్టేది. మేం ఏడుపు మానీసి అది నాకుకోమండోలిమి. నాపీ ఒక సిటం పోయింతరాత కడుపు దువ్వీసీది ఆకల్తోటి !

ఇప్పుడు పెద్దయినాం. ఆకలి బతుకులు పోతాయనుకొని 'అమ్మ' చెయ్యి దిక్కు కొన్నాళ్ళు సూసినాం. తరాత 'అన్న'వనుకోని నీ దిక్కు సూసాము !

మీరు మండకి బెల్లం రాస్ని నాకమంతన్నారు. మండకి బెల్లంతోటి...కడుపు మంట తీరదుబాబో-తీరదు..." అన్నాడు వేదనగా !

ముఖ్యమంత్రిగారు అదోలా చూసారు వీరడ్ని.

వీరడు చేతిలో కవర్ని అటూ, ఇటూ తిప్పి చూసాడు. ఎదురుగా స్టాల్స్‌లో కన్పిస్తోన్న ట్రాక్టర్ని, మోటారునీ వగైరాలనీ చూసాడు.

చూసి, చేతిలోని కవరు సభా సదులందరికీ కనబడేటట్లుగా ఎత్తి పట్టుకొని పర, పరా చించి ముక్కలు జేసాడు !